క్లుప్తంగా

పోలీసుల అదుపులో కోడి పందేలా రాయుళ్లు



నిందితులతో పాటు పందెం కోళ్లను చూపుతున్న సీఐ శ్రీనివాసరావు

కావలి: మండలంలోని అన్నగారిపాళెం అటవీ ప్రాంతంలో కోడి పందెం ఆడుతున్న ఆరుగురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు కావలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి 7 పందెం కోళ్లు, రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు



గాయపడిన యువకుడు

మర్రిపాడు: బైక్‌కు గేదెలు అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తా పడి ఓ యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని పడమటి నాయుడుపల్లి సమీపంలో నెల్లూరు– ముంబయి జాతీయ రహదారిపై శనివారం జరిగింది. అతను బద్వేల్ నుంచి మర్రిపాడు వైపు వస్తుండగా జరిగిన ఈ ప్రమాదం తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది గాయాలపాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్‌లో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణంపై ఉన్నతాధికారుల సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి శనివారం తెలిపారు. ఈ దాడుల్లో 40 మంది సీసాలతో పాటు రావినూతల ఏసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం



దాడిలో గాయపడిన చినమాలకొండయ్య

కొండాపురం: పొలం వివాదమై ఒక వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని చింతలదేవిలో శనివారం మధ్యాహ్నం జరిగింది. ఎస్సై షేక్ ఖాజావలి సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కె.ఇస్తేరమ్మ, ఆమె కుమారుడు కె రమేష్ కొన్నేళ్ల క్రితం వారికి ఉన్న 2.30 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని అదే గ్రామానికి చెందిన జి చిన్నమాలకొండయ్యకు విక్రయించారు. ఆరు నెలల క్రితం రమేష్, మాలకొండయ్య మధ్య పొలం వద్ద వివాదం జరిగింది. ఇరువర్గాలు తహసీల్దార్ వద్ద పంచాయితీ నిర్వహించారు. ప్రభుత్వ భూమిని అమ్మేదానికి, కొనేదానికి మీరు ఎవరని, ఇద్దరికి లేకుండా చేస్తానని అప్పటి తహసీల్దార్ హెచ్చరించడంతో అక్కడి నుండి వెళ్లిపోయారు. శనివారం రమేష్ చినమాలకొండయ్య ఇంటికి వెళ్లి అతన్ని ఇంట్లో నుంచి బయటకు లాకొచ్చి తన వెంట తెచ్చుకున్న మొద్దు కత్తితో చినమాలకొండయ్యపై హత్యాయత్నం చేశాడు. శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేయడంతో ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్‌షెల్టర్ ప్రారంభం



కృష్ణారెడ్డిపాళెంలో నిర్మించిన బస్‌షెల్టర్

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం సెంటర్‌లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్డి శ్రీహరిరెడ్డి సొంత నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం తమ కుటుంబ పెద్దలు కొండారెడ్డి, సుందరమ్మ జ్ఞాపకార్థం బస్‌షెల్టర్‌ను నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జక్కం మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, ప్రముఖ వైద్యుడు జే ప్రణీత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. డాక్టర్ వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో మూడు రోజుల పాటు పోటీలు జరగనున్నట్లు డాక్టర్ ప్రణీత్ తెలిపారు. ఎస్ఆర్‌జేడీ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభమైన ఈ పోటీల్లో ముందుగా క్రీడాకారులను డాక్టర్ ప్రణీత్ పరిచయం చేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. విజేతలకు చివరి రోజు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


ఊరు మారింది

పల్లె ముంగిట్లో పండగ వాతావరణం పరిఢవిల్లుతోంది. ఒకప్పటి ఊరుకు.. ఇప్పటి ఊరులో వచ్చిన కొత్త కళను చూసి ఔరా అంటూ అబ్బురపోతున్నారు. బతుకుదెరువు నిమిత్తం దేశ, విదేశాల్లో ఉంటున్న స్థానికులు సంకాంత్రికి సొంతూర్లకు వచ్చారు. కొన్నేళ్ల తర్వాత పల్లెల్లోకి అడుగు పెట్టిన వీరికి పచ్చని పైర్లు స్వాగతం పలుకుతున్నాయి. పాడిపంటలు సుభిక్షంగా ఉండడంతో పల్లెటూర్లకు కొత్త శోభ వచ్చింది. అధునాత సౌకర్యాలతో సరికొత్త శోభను సంతరించుకున్న సచివాలయం, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, పాఠశాలల భవనాలు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాలతో పండగ కళ వచ్చింది. ప్రతి పల్లెలో వచ్చిన మార్పుపైనే చర్చ జరుగుతోంది.

- సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లతో పల్లెలకు కొత్త కళ
- శిథిల పాఠశాల భవనాలకు అధునాతన శోభ
- సొంతూర్లకు వచ్చిన స్థానికులు
- పల్లెలో వచ్చిన మార్పుపై చర్చలు



రైతుభరోసా కేంద్రం



వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ

ఉదయగిరి: సంక్రాంతి.. పల్లెలకే కాదు, పట్టణాలకు పెద్ద పండగ. బిజీ బిజీగా గడుపుతున్న జీనవ పోరాటంలో కాస్త విశ్రాంతిని ఇచ్చే పండగ. ఒకప్పుడు సంక్రాంతి వస్తుందంటే నెల ముందు నుంచే పల్లెల్లో సందడే సందడి. భోగి మంటలు వేసేందుకు పిల్లలు, యువకులు పండగ నెల పెట్టిన నాటి నుంచి రేగి కంప కొట్టి ఇంటికి తీసుకోస్తారు. ఆ కంపతో పొద్దు పొద్దునే చలి కాసుకుంటూ పిచ్చాపాటిగా మాట్లాడుతూ ఆనందంగా గడిపేవారు. కొత్త అల్లుళ్లు, బంధువులతో పల్లెల్లో పండగ సందడి, కోలాహలంగా ఉండేది. అందరూ కలిసి, మెలిసి పోయి, ఏడాది పొడవునా పడిన కష్టాన్ని మరచి ఊరు పొలాల్లో, వాగుల్లో, బావుల్లో పల్లె ప్రకృతి రమణీతను ఆస్వాదిస్తూ సంతోషాల సాగరంలో మునిగి తేలేవారు. అప్పటి పండగ వాతావరణమే విభిన్నం. కాలానుగుణంగా జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి. బతుకుదెరువు కోసం కొందరు దేశంలోని వివిధ ప్రాంతాలకు వలసలు పోతే.. మరి కొందరు ఉన్నత చదువులతో విదేశాలకు వెళ్లిపోయారు. సంప్రదాయాల స్థానంలో ఆధునిక పాశ్చాత్య పోకడలు పొడచూపుతున్నాయి. సంపాదన పేరుతో పల్లెలు పట్టణం వైపు పరుగులు పెట్టుతున్నాయి. చదువుల పేరుతో విద్యార్థులు, ఉపాధి పేరుతో యువత పల్లెలు విడిచి నగరం వైపు క్యూ కట్టారు. దీంతో పల్లెల్లో వయస్సు మీరిన వృద్ధులు, పల్లెలు వదల్లేని జనాలు మాత్రమే కనిపిస్తున్నారు. అలనాటి పండగ వాతావరణం కనిపించడం అరుదైపోయింది. అయితే పల్లెల్లో అలనాటి సంక్రాంతి మూలాలు చూసిన వారు మాత్రం తమ పిల్లలతో సంక్రాంతికి పల్లెకు వస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్న యువత, వ్యాపారాలు చేస్తున్న కొంత మంది ఈ మూడు రోజులు తమ సొంతూరులో గడిపేందుకు వస్తుండడంతో పల్లెల్లో సందడి కనిపిస్తోంది. బంధువుల యోగాక్షేమాలు విచారిస్తూ పాత జ్ఞాపకాలను నెమర వేసుకుంటున్నారు. ఎప్పుడో పల్లె వదిలి దేశ, విదేశాల్లో స్థిరపడి కొత్తగా పల్లెకు వచ్చిన వారు పల్లెలో వచ్చిన మార్పు చూసి నిబిడాశ్చర్య చకితులు అవుతున్నారు.

పల్లెల్లో పాలనా సౌకర్యాలు

హరిదాసు కీర్తలు, గంగిరెద్దుల ఆటలు, దేవర దీవెనలు, ఇంటి ముందు రంగు రంగుల రంగవల్లులు సందడి కనిపించకపోవడం ఒకింత బాధ కలిగించినా.. ఈ నాలుగేళ్లలో పల్లెలో వచ్చిన అభివృద్ధి మార్క్‌ను చూసి మురిసిపోతున్నారు. ఇసుక నేలపై అ.. ఆ..లు నేర్చుకున్న నాటి బడి స్థానంలో నాడు–నేడు కింద పాఠశాలలు కార్పొరేటు స్థాయిలో అభివృద్ధి చూసి అనందం వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల కోసం పల్లెల నుంచి పట్టణాలకు పరుగులు తీయకుండా ఊరుల్లోనే కొలువైన రైతు భరోసా కేంద్రాలు, బీపీ, షుగరు చెకప్, చిన్న జ్వరాలకు బయట ప్రాంతాల్లో ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండానే ఊరులోనే ఆరోగ్య కేంద్రాలు, ఫ్యామిలీ డాక్టర్‌ను చూసి ఇంత మార్పునా అంటూ ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోతున్నారు. గ్రామాల్లోనే సచివాలయ సేవలు అబ్బుర పరుస్తున్నాయి. నాడు పింఛను కోసం పంచాయతీ కార్యాలయానికి కాళ్లీడ్చుకుంటూ వెళ్లి రోజుల తరబడి తిరిగి దౌర్భాగ్య స్థితి నుంచి వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్లు ఇచ్చిపోతున్న మార్పును చూసి గ్రేట్ అంటూ మురిసిపోతున్నారు. ఇంటి ముందుకే రేషన్ బండి వచ్చి సరుకులు ఇచ్చిపోతున్న తీరు.. ఎక్కడా లేదే ఈ సిస్టం అంటున్నారు. ఆధునిక అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, పిల్లలకు నాణ్యమైన పోషకాహారం, పాఠశాలల్లో రుచికరమైన మధ్యహ్న భోజనం, అంతర్గత మట్టి రోడ్ల స్థానంలో సిమెంట్ రోడ్లుగా దర్శనం ఇవ్వడం, గ్రామాలను తలపిస్తున్న కొత్త కాలనీలు ఊహకందని మార్పునకు ప్రతీకగా నిలిచాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్పు గత 50 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో కనిపించకపోగా, ఈ నాలుగేళ్లలో సాధ్యం కావడంపై సీఎం జగన్ పాలన, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, సంక్షేమం గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్నారు.

పల్లె చాలా మారింది



నేను కరోనాకు ముందు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం అమెరికాకు వెళ్లాను. అప్పుడు మా ఊర్లో పెద్దగా వసతులు లేవు. నేను సంక్రాంతికి మా ఊరు వస్తాను. కానీ ఈ దఫా ఊరులో ఎంతో మార్పు కనిపిస్తోంది. అప్పటికి.. ఇప్పటికి అభివృద్ధి తేడా స్పష్టంగా ఉంది. ఊరులోనే గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, ఆరోగ్య కేంద్రం ఇలా ఎన్నో సేవా కేంద్రాలు వచ్చాయి. స్థానికంగానే ఎంతో మేలు పొందుతున్నారు. ప్రజలకు కూడా వ్యయ ప్రయాసలు బాగా ఆదా అవుతాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారు.

– చాగంటి కమలాకర్, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం

పల్లెలో అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో మార్పొచ్చింది



మేము ఉపాధి కోసం పదిహేళ్ల కితం బెంగళూరు వెళ్లాం. అప్పుడు మా గ్రామంలో కనీస వసతులు లేవు. చిన్న అవసరం ఉన్నా ఉదయగిరికి వెళ్లాలి. కానీ నేడు మా పల్లె చూస్తే ఎంతో మార్పు కనిపిస్తోంది. పదేళ్ల క్రితం.. నేటికి ఆ మార్పులో చాలా తేడా ఉంది. నేడు గ్రామంలో సిమెంట్ రోడ్డు, సచివాలయం, ఆరోగ్య కేంద్రం, అన్ని హంగులతో బడి.. ఇలా ఎన్నో వసతులు ఊరులోనే ఉన్నాయి. పల్లె చూస్తే ముచ్చటేస్తోంది.

– చింతంరెడ్డి విజయమ్మ, సీతారామపురం

సంక్రాంతి శుభాకాంక్షలు



మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: సంక్రాంతి పండగ వేళ నియోజక వర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఉదయగిరి నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజాగోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రతి ఇంట భోగభాగ్యాలు, అష్టైశ్వరాలతో కళకళలాడుతూ ఉండాలని కోరారు.

నిత్యాన్నదానం గొప్ప విషయం

- జి అనిల్‌కృష్ణారెడ్డి



డాక్టర్ అనిల్‌కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు నిత్యం అన్నప్రసాద వితరణ చేస్తున్న సాంబశివ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వర రెడ్డి నిర్ణయం గొప్పదని, పలువురికి ఆదర్శనీయమని నెల్లూరు మెడికవర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ జి అనిల్‌కృష్ణారెడ్డి అన్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న నిత్యాన్నదానాన్ని ఆయన పరిశీలించి మెచ్చుకున్నారు. అనీల్‌కృష్ణారెడ్డిని ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ సర్పంచ్ గుండాల హనుమాన్ రెడ్డి, కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు హెచ్ఎం నారాయణ రావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మల్లికార్జున, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ వద్ద రంగా విగ్రహం ఏర్పాటు



డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కావలి రంగా విగ్రహ సన్నాహక కమిటీ సభ్యులు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెల్లడి

కావలి: పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో రైతుబజార్ వద్ద ఉన్న డివైడర్ ప్రాంతంతో వంగవీటి మోహన్ రంగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలిలోని ఎమ్మెల్యే నివాసానికి రంగా విగ్రహ ఏర్పాటు సన్నాహక కమిటీ సభ్యులు శనివారం వచ్చారు. ఎమ్మెల్యే సంబంధితశాఖల అధికారులతో అప్పటికప్పుడు మాట్లాడి తాడిత, పీడిత వంగవీటి మోహన రంగా స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన గురుతర బాధ్యత అందరిపై ఉందన్నారు. పట్టణంలో రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన అధికార చర్యలు జాప్యం లేకుండా తీసుకుంటానని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సన్మానించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మూడో సారి ఎమ్మెల్యేగా గెలుపొందాలని, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎస్.ప్రభాకర్‌నాయుడు ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మండలి కృష్ణారావు, దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి జీఎంకే ట్రస్ట్ రూ.లక్ష విరాళం



నగదు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధి వెంకటేశ్వర్లు

వరికుంటపాడు: మండలంలోని కాంచెరువులో నూతనంగా నిర్మిస్తున్న విఘ్నేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఉదయగిరి మండలం గండిపాళెం జీఎంకే ట్రస్ట్ అధినేత, ఉదయగిరి వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. గ్రామంలో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహకులు ఆయన దృష్టికి తేవడంతో ఆయన స్పందించి తన వంతుగా రూ.లక్ష నగదును ప్రకటించారు. తన ప్రతినిధుల ద్వారా శనివారం నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి బుడంగుంట వెంకటేశ్వర్లు, ఆలయ నిర్వాహకులు జి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం



రావిపాడులో గడప గడప కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రాజారెడ్డి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు గడప గడపకు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రావిపాడులో శనివారం సర్పంచ్ కొండపల్లి లక్ష్మమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజారెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ఈ 57 నెలల్లో ప్రభుత్వం ద్వారా వారికి అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వం మధ్య ఉన్న తేడాను వివరించారు. మళ్లీ సీఎంగా జగన్‌ను ఎందుకు గెలిపించుకోవాలో వివరించారు. ప్రజల నుంచి సానుకూల స్పందన రావడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌కు మద్దతగా, అండగా ఉండాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేయడం సామాన్య విషయం కాదన్నారు. దేశ చరిత్రలో ఒక్క జగన్‌కే సాధ్యమైందన్నారు. సమాజంలో అన్నీ వర్గాల ప్రజల బాగోగులను లెక్కలోకి తీసుకుని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగించారన్నారు. ప్రతి ఏడాది ఒక్క సామాజిక పింఛన్లకే రూ.24 వేల కోట్లు ఖర్చు చేసే సాహసం ఏ సీఎం చేయలేరన్నారు. అభివృద్ధి పరంగా పల్లెల్లో ఎంతో ముందంజలో ఉన్నాయి. ప్రతి పంచాయతీలో కనీసం రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయి. విద్య, వైద్య ఆరోగ్యంపై రూ. కోట్లు ఖర్చు చేసి సామాజిక రంగంలో నూతన ఒరవడి సృష్టించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అనంతరం మేకపాటి పలువురు గ్రామస్తులకు స్వయంగా భోజనం వడ్డించి అందరితో కలిసి తాను భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎం.విజయరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రేవూరు శ్రీనివాసరెడ్డి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ మద్దూరి బాబు, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, జూపల్లి రాజారావు, కొండపల్లి రమేష్, రొడ్డ కొండయ్య, ఎం.అంజనేయులు, ఎం.రామారావు, సురేష్, ఎస్సై కోటిరెడ్డి ఉన్నారు.

కోలాహలంగా విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఆత్మకూరురూరల్: కరటంపాడులో కేక్ కట్ చేస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, తదితరులు



సోమశిల: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



చేజర్ల: మాముడూరులో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మర్రిపాడు : ఎమ్మెల్యే మేకపాటి జన్మదిన వేడుకలు



సంగం : కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఘనంగా నిర్వహించారు. మండలంలోని కరటంపాడులో జేసీఎస్ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, నాయకులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నెట్టెం పిచ్చయ్యనాయుడు, శేషయ్య, అలీఖాన్, కంచర్ల వెంగయ్య, ఉస్మాన్‌ఖాన్ పాల్గొన్నారు. వెన్నువాడలో దిశించర్ల రాజగోపాల్, దిశించర్ల ప్రసాద్, జగన్నాథం ప్రసాద్ తదితరులు పాల్గొనగా, అప్పారావుపాళెంలో జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, స్థానిక నాయకులు శ్రీనివాసులునాయుడు, చంద్రా హజరత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంగంలో..

సంగం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి నాయకలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, నాయకులు బాలచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడి మల్లికార్జున రెడ్డి, సర్పంచ్‌ల సంఘం నియోజకవర్గ ప్రతినిధి మానికల చందన్‌కుమార్, రామారావు, వైఎస్సార్‌సీపీ యువజన సంఘం నాయకులు జనార్దన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు జహంగీర్, వేణు, శివ, నరేష్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడులో..

మర్రిపాడు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, యువనాయకులు దుద్దుగుంట రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, రాజగోపాల్‌రెడ్డి, నాయకులు 100 అడుగుల ఎత్తులో ఎమ్మెల్యే చిత్రాలతో కూడిన స్కై బెలూన్ పోస్టింగ్, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ రేవూరు వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ సిద్ధంరెడ్డి రమాదేవి, మాజీ ఎంపీపీ కోనంకి శ్రీనివాసులు నాయుడు, దుద్దుగుంట జయరామిరెడ్డి, కాశిరెడ్డి, చంద్రా నారాయణస్వామి, షేక్ మౌలాలి, విష్ణువర్ధన్‌రెడ్డి, షేక్ అన్వర్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చేజర్లలో...

చేజర్ల: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం చేజర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. మాముడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొలుత కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు,మండల వైఎస్సార్‌సిపి సీనియర్ నాయకులు కొమ్మి సిద్దుల నాయుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బాలగంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో..

సోమశిల: అనంతసాగరంలో శనివారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బట్రెడ్డి జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు క్రీడాకారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఎస్సీ కాలనీలో 250 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొమ్మవరం, అగ్రహారం, చాపురాళ్లపల్లిలో స్థానిక నేతలు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శోభ, మండల సచివాలయ కో ఆర్డినేటర్ అంకిరెడ్డి, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, కో ఆప్షన్ సభ్యుడు కరిమొహిద్దీన్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బట్రెడ్డి నాగేంద్రరెడ్డి, సచివాలయ కన్వీనర్ శ్రీను తదితరులు ఉన్నారు.

ఆక్రమణల పరిశీలన



ఇరిగేషన్ అధికారులు పరిశీలిస్తుండగానే అక్రమ నిర్మాణాలు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ వద్ద ఇరిగేషన్ కాలువపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను సంబంధిత అధికారులు శనివారం పరిశీలించారు. నిర్మాణాలు ఆపాలని అధికారులు తెలిపినా ఆక్రమణదారులు ఏ మాత్రం ఖాతరు చేయకుండా వారి ఎదుటనే నిర్మాణ పనులు యథావిధిగా చేపట్టారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఇరిగేషన్ సిబ్బంది తెలిపారు. యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ, మున్సిపల్ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



ఆలయ హుండీ లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

సంగం: సంగంలోని కామాక్షి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ హుండీ లెక్కింపు చేపట్టారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో నెల రోజుల పాటు భక్తులు స్వామి అమ్మవార్లకు సమర్పించిన కానుకలను సిబ్బంది లెక్కించారు. హుండీలో భక్తులు రూ.1,00,500 నగదు, బంగారు కాసు, డాలర్ కానుకలుగా సమర్పించినట్లు ఆలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్ర బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.